

# పుస్తక పరిచయం




*Published by:*
CP Brown Academy
53, Nagarjuna Hills
Hyderabad – 500 082
Phone: 040-23430448

**తెలుగు సాహిత్యంలో** 'శారద'ది ఒకప్రత్యేక స్థానం. 'శారద' అంటే చాలామంది తెలుగు పాఠకులకి తెలియకపోవడం ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. 1955 లోనే ఆయన చనిపోవడం ఒక కారణమైతే, ఏ సాహితీ వర్గమూ ఆయన్ని తన ప్రతినిధిగానో, సభ్యుడిగానో పరిగణించి ప్రచారం చేయకపోవడం మరొక కారణమై ఉండవచ్చు. 'శారద' కలం పేరుతో కథ, నవల, నాటిక, వ్యంగ్యకథనం..లాంటి సాహితీప్రక్రియల్లో తనదైన ముద్రవేసిన నటరాజన్ జీవితం, వ్యక్తిత్వ వికాస విశ్లేషకులకి ఒక అధ్యయన గ్రంథం లాంటిది. ఒక పక్క కటిక దరిద్రం, మరోపక్క అనారోగ్యం ఆ అనారోగ్యం కూడా ఎప్పుడు, ఎక్కడ ఏ స్థితిలో హఠాత్తుగా పడిపోతాడో ఊహించలేని మూర్ఛరోగం. పడితే, దేహానికి గాయాలై మరోబాధని కల్పించే అవకాశం ఉన్న జబ్బు. తెలుగులో ఎలాంటి ఫార్మల్ విద్యాభ్యాసం లేకుండానే- తెలుగు సాహితీ సంద్రంలో అనర్ఘరత్నాలని సృష్టించిన ఘనుడు 'శారద'. తమిళం మాతృభాషగా పెరిగిన నటరాజన్ పదమూడేళ్ళ వయసులో తెనాలిలో అడుగుపెట్టాడు. తెలుగులో అక్షరం ముక్కరాదు. ఆ తరువాత తొమ్మిదేళ్ళపాటు తెలుగు నేర్చుకోవడానికి నానా కష్టాలు పడ్డాడు. తన 22వ యేట మొదటి రచన చేశాడు. మరో తొమ్మిదేళ్ళపాటు ఉధృతంగా రచనలు చేసి 31 సంవత్సరాలకే నూరేళ్ళూ నింపుకున్నాడు 'శారద'. ఆయన జీవన యానమే ఈ పుస్తకం. ప్రముఖ రచయిత, సాహితీ విమర్శకులు విహారిగారు ఈ 140 పేజీల పుస్తకంలో 'శారద' విశ్వరూపాన్ని సందర్శింపచేశారు. 'శారద' వ్యక్తిగత జీవిత విశేషాలతో మొదలుపెట్టి, ఆయన రచనల్లో చాలా వాటిని స్థూలంగా పరిచయం చేసి, విశ్లేషించి, అనుబంధంలో 'శారద' గురించి వివిధ సందర్భాల్లో వచ్చిన వ్యాసాలని కూడా జతచేశారు.

సమస్తజీవితం గాయాల మయమై ఎన్నెన్నో నిరాదరణలకు, హేళనలకూ గురవుతూ ఎన్నో వత్తిళ్ళలోంచి, దుఃఖంలోంచి జీవితపోరాటమే సాహిత్యంగా, సాహిత్యమే జీవితంగా పలవరించిన 'శారద' గురించి ఈ తరం సాహితీప్రియులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు చక్కటి సాధనం ఈ పుస్తకం. . ***




**ప్రవాస భారతీయ రచయితల్లో** అత్యధిక విద్యార్హతలు, పట్టాలు పొందిన రచయిత్రి డా.శారదాపూర్ణగారు ఒక్కరేననడంలో అతిశయోక్తిలేదు. తెలుగు, సంస్కృత సాహిత్యాలలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఇంకా డి.లిట్ కోసం శ్రమిస్తున్నారు. లలిత సంగీత కచేరీలు, రచనలు, పరిశోధనాత్మక వ్యాసాల్లో ప్రావీణ్యం, తనదైన ప్రత్యేకత సంపాదించుకున్నారు. అనేక గ్రంధాలు రచించారు. తెలుగు-ఆంగ్ల కవితల సంపుటిని వెలువరించారు. గత కొన్ని దశాబ్దాలుగా అమెరికాలో నివసిస్తూ ఇవన్నీ సాంధించడం డా.శారదాపూర్ణగారికి మాత్రమే సాధ్యపడింది. వీరు వ్రాసిన మరొక విలక్షణ గ్రంధం ప్రతీచి లేఖలు. ప్రతీచి, వైయాసిల మధ్య సాగిన లేఖాపరంపర ఇది. వైయాసి నివాసం జంబూద్వీపంలోని కృష్ణాతీరం ఐతే, ప్రతీచి క్రౌంచద్వీపానికి వలసవచ్చి జీవనయానం సాగిస్తున్న వ్యక్తి. శారదాపూర్ణగారి ఆలోచనల్లోని వైలక్షణ్యం ఈ లేఖల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. జిజ్ఞాస జీవంగా నడచిన ఈలేఖల్లో ఎన్నెన్నో కొత్తవిషయాలు మరింత వినూత్నంగానూ, మామూలు విషయాలు సరికొత్తకోణాల్లోనూ చర్చించబడ్డాయి. వైయాసి ఒక లేఖలో వ్రాస్తాడు ' వేదాంతార్థం తెలియాలంటే వేటే దృష్టి కావాలి. అఖండ దృష్టి కావాలి. భౌతికశాస్త్ర దృష్టికి పూర్తిగా వ్యతిరేకమన్నమాట.' అని. గాఢమైన తాత్విక చింతన, తార్కిక సమాలోచన ఈ లేఖల అంతరార్థం. మరోచోట ' మన భావాలు మారుతాయి. వాటికనుగుణంగా అన్నీ మారుతాయి. చూసే వస్తువులు మారుతాయి. మనదృష్టిమారుతుంది. మనం చూసే దృశ్యాలు మారుతాయి. అనుభూతి మారుతుంది. ఇంద్రియాలకందే సర్వం అలా మారుతూనే ఉంటుంది. కారణం 'ఏమిటి? మొదలెక్కడ? మార్పెక్కడ జరుగుతోంది?'. ఆలోచనల లావా పొంగి ప్రవహించిన సరికొత్త సాహితీ స్రవంతి ఈ 'ప్రతీచి లేఖలు..' పుస్తకం.!

***For Copies :***

***SONTY Publications***
***3042 Carmel Drive***
***Flossmoor, IL USA***
***Phone: 708 957 4302***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**